TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక :03 ఎడిటర్ : సింగిడి అమృత్ తెలంగాణ సోమవారం.28.07.2025 పేజీలు : 8, వెల:రూ.1.00

## కాంగ్రెస్ చేస్తున్న దోపిడీని నిలదీస్తాం: కేటీఆర్

పరకాల :అమృత్ తెలంగాణ: కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కు సమీపంలో నాలా నిర్మాణం కోసం 160 కోట్ల దోపిడీకి మంత్రులు ఎమ్మెల్యేలు తెరలేపారని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి స్థాపించిన పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 500మంది మహిళలకు గతంలో కుట్టు శిక్షణ ఇవ్వడం జరిగింది. వారందరికి ఆదివారం పరకాల లలిత కన్వెన్షన్ హాల్లో పరకాల, నడికూడ మండలాలకు చెందిన మహిళలకు కుట్టు మిషన్లు పపిణి చేయడం జరిగింది.



ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. మెగా టెక్స్టైల్ పార్క్ సమీపంలో కాలువ నిర్మించడానికి జనవరి నెలలో రూ.137 కోట్లతో టెండర్లు పిలిచి టెండరింగ్ పూర్తి అయినప్పటికీ, ఆ పనికి తట్టెడుమట్టికూడ పోయకుండానే మార్చి నెలలో అదే పనికి ఎస్టిమేషన్ సరిపోదంటు మరో రూ.160 కోట్లు పెంచుతూ రీ టెండర్స్ పిలవడంలో మతలాబేంటంటు కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒక కాలువ నిర్మాణంలో సుమారు రూ.160 కోట్ల దోపిడీకి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు తెరలేపారని ఆరోపించారు. కాంగ్రెస్ అంటేనే దోపిడి అని, ఆ దండుపాళ్యం మూఠా ఆటలు ఆడనివ్వమంటు కాంగ్రెస్ నాయకులపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. ఓరుగల్లుకు తల మానికమైన ఆజాంజాహీ మిల్లు గత పాలకుల పుణ్యమా అని మూతపడిందన్నారు.

ఎంతో నైపుణ్యం కలిగిన చేనేత కార్మికులు ఆజాంజాహి మిల్లు మూతపడ్డాక, పొట్ట చేత పట్టుకుని ఇతర రాష్ట్రాలకు వలస పోయిన చరిత్రను మరువలేమన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత చేనేత కార్మికుల నైపుణ్యని గుర్తించి, వలసలు నివారించాలని, స్థానిక యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పం వరంగల్ కేంద్రంగా ఆజాం జాహీ మిల్లుకు బదులుగా కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ నిర్మించుకోవడం జరిగిందన్నారు. అప్పటి ఎమ్మెల్యేగా ధర్మారెడ్డి టెక్స్టైల్ పార్క్ నిర్మాణం కోసం రైతులను ఒప్పించి 1500 ఎకరాల భూమి సేకరించడం జరిగిందంటూ ధర్మారెడ్డి కృషిని కొనియాడారు. 2023లో తీవ్ర కరోనా కాలమైనప్పటికి, అనేక కంపెనీలతో చర్చించి కైటెక్స్, యంగ్ ఇండియా, గణేశా వంటి ఎన్నో కంపెనీలను ఒప్పించు టెక్స్టైల్ పార్క్ కు తీసుకురావడం జరిగిందన్నారు.

ప్రస్తుతం కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో పలు కంపెనీలలో 25వేల మందికి ఉద్యోగ కల్పించనున్నట్లు కంపెనీలు ప్రకటిస్తే, కాంగ్రెస్ నాయకులు పైరవీల పేరుతో చేస్తున్న బెదిరింపులను తట్టుకోలేక కంపెనీలు పారిపోతున్నాయన్నారు. అధికారంలోకి రావడానికి ముందు కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో అనేక హామీలు ఇచ్చి, ఏ ఒక్కటి నెరవేర్చని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. వ్యవసాయ కూలీ మహిళలకు రూ. 2500, రూ.4 వేల పెన్షన్, తులం బంగారం, ఉచిత గ్యాస్ పంపిణీ, అన్నీ ఉత్త మాటలు గానే మిగిలాయన్నారు. ఉచిత బస్సు మాత్రం అమలు చేసి మొత్తం ఎగవేస్తామంటే చూస్తూ ఊరుకోకూడదంటు మహిళలనుద్దేశించి ప్రసంగించారు. జరుగబోయె స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ ను ఆదరించి అక్కున చేర్చుకోవల్సిన అవసరం ఉందన్నారు.

మీరు చూపించే ఆదరణ చూసిన కాంగ్రెసు నాయకులకు దిమ్మ తిరిగి ఒళ్ళు దగ్గర పెట్టుకోని పనిచేసేలా ఉండాలన్నారు. ఈ సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, దాస్యం వినయ్ భాస్కర్, శంకర్ నాయక్, నన్నపనేని నరేందర్, గండ్ర వెంకటరమణారెడ్డి ,మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మరావు, ఏనుగు రాకేష్ రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగుర్ల వెంకన్న, మేడిపెల్లి శోభన్, మాజీ ఏనుమాముల మార్కెట్ కమిటీ చైర్మన్ చింతం సదానందం, పరకాల మండలం అధ్యక్షులు చింతిరెడ్డి మధుసూదన్, మాజీ జడ్పీటిసి సిలువేరు మొగిలి, బిఆర్ఎస్ నాయకులు నేతాని శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య సొసైటీలకు నగదు బదిలీ చేయాలి

పాలకుర్తి : అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో మత్స్య సొసైటీ జల వనరులకు ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీకి బదులుగా.. నగదు బదిలీ పథకం ద్వారా సొసైటీల ఖాతాల్లో జమ చేయాలని మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో గల శుభం గార్డెన్ (కరుణ మూర్తి ప్రాంగణం)లో నీరటి చంద్రయ్య, పిట్టల స్వరూప, చొప్పరి బిక్షపతి అధ్యక్షతన శనివారం మత్స్య కారులు, మత్స్య కార్మిక సంఘం జిల్లా మూడో మహాసభ జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 6550 మత్స్య కార్మికుల సొసైటీల్లో 6 లక్షల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. గత పాలకులు అమలు చేసిన మత్స్య సొసైటీలకు ఉచిత చేప పిల్లలు, రొయ్యల పంపిణీ కార్యక్రమం దళారీలకు కల్పతరువుగా




మారిందన్నారు. కుంటలు, చెరువులు, రిజర్వాయర్లలో ఉచితంగా చేప పిల్లలు పోయాల్సి ఉండగా సీజన్ దాటినా ప్రారంభించనందున మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోతారని అన్నారు. నగదు బదిలీ కోసం 500 మంది సొసైటీ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డికి ఉత్తరాలు రాసినట్టు తెలిపారు. సొసైటీలకు నగదు జమ చేయడంతో సీజన్ ప్రకారం చేప పిల్లల పెంపకం జరుగుతుందని, మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నేటికీ చేప పిల్లల పంపిణీ విషయంలో నిర్దిష్టమైన ప్రకటన చేయక పోవడంతో మత్స్య కారులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందిం చి ఎలాంటి టెండర్లూ లేకుండా మత్స్య సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలన్నారు.

## విలీనం చేసే ప్రసక్తే లేదు: కేటీఆర్

హైదరాబాద్:అమృత్ తెలంగాణ: తెలంగాణ ఉన్నంతవరకు బీఆర్ఎస్ ఉంటుందని, తమ పార్టీని మరే ఇతర పార్టీలోనూ విలీనం చేసే ప్రశ్నే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ చేసిన ఆరోపణలకు కేటీఆర్ పై విధంగా స్పందించారు. బీఆర్ఎస్ విలీనం అనే అంశం పసలేని వాదన అని కొట్టిపారేశారు. రాజకీయ ఇరకాటంలో పడిన ప్రతిసారీ బీజేపీ, కాంగ్రెస్ లు ఈ విలీనం అంశాన్ని తీసుకువస్తుంటాయని విమర్శించారు. స్కాంల నుంచి ప్రజల




దృష్టిని మళ్లించేందుకే ఇప్పుడు విలీనం అంశం తెరపైకి తెచ్చారని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీఎం రమేశ్ ఇద్దరూ కలిసి వస్తే తాను చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు

## తెలంగాణ సంస్కృతికి ఓయూ ప్రతిబింబం

ఓయూ : అమృత్ తెలంగాణ: ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రారంభం నుంచి ఉన్నతమైన చరిత్రను కలిగి ఉందని, ఇది తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో శనివారం రాత్రి జరిగిన ఆర్ట్స్ కళాశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆలోచనలు ఏమైనా, భావజాలాలు ఏమైనా స్వేచ్ఛగా వ్యక్తం కావాలని, అన్ని హక్కులలోకెల్లా భావ ప్రకటన స్వేచ్ఛ చాలా ముఖ్యమని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో కలిసి ముందుకు వెళ్లాలనుకున్నామని, ఉన్నత విద్యను స్కిల్ బేస్డ్ నాలెడ్జ్ సెంటర్‌గా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను తయారు చేసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. అడ్వాన్స్ ట్రైనింగ్ సంస్థల ద్వారా ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల నియామకం చేయబోతున్నామని, ప్రతి బిడ్డకూ ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. దేశంలో మొదటి సరిగా, సమగ్రంగా కులగణన చేపట్టామని, దేశానికి ఆదర్శంగా నిలిచామని అన్నారు. ప్రపంచంతో పోటీ పడే విధంగా విద్యా వ్యవస్థను తీర్చి దిద్దుతున్నామన్నారు. పేదల బతుకులు మారాలంటే విద్యను నిర్లక్ష్యం చేయొద్దని, బాగా చదివి తెలంగాణ, దేశ అభివృద్ధిలో భాగమవ్వాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు అంశాలపై దృష్టి కేంద్రీకరించిందని, ఒకటి విద్య, రెండు వైద్యం అని చెప్పారు. రాష్ట్రంలో 104 యంగ్ ఇండియా స్పోర్ట్స్, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. వీటి వల్ల తెలంగాణ ముఖ చిత్రం మారుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. పబ్లిక్ యూనివర్సిటీలలో అన్ని బకాయిలనూ చెల్లిస్తున్నట్టు తెలిపారు. ఆడిటోరియం నిర్మాణం కోసం అవసరమైన చర్యల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. కార్యక్రమానికి చీఫ్ ప్యాట్రన్‌గా వ్యవహరించిన ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగరం మాట్లాడుతూ.. ఆర్ట్స్ కళాశాల చాలా చైతన్యవంతంగా పని చేస్తుందన్నారు. నిరంతరం విద్యార్థులతో అకడమిక్, కల్చరల్



కార్యక్రమాలతో నిండుగా కొనసాగుతుందన్నారు. 8 నెలల కాలంలో కళాశాలలో గుర్తించదగ్గ మార్పులు వచ్చాయని, దీనికి కారణమైన ప్రిన్సిపాల్ ప్రొ.సి.కాశీంని, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌ని ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నిర్మించాలనుకుంటున్నట్టు తెలిపారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. సి.కాశీం కళాశాల వార్షిక రిపోర్టును ప్రవేశపెట్టారు. ఆర్ట్స్ కాలేజీలో ప్రతిభావంతమైన విద్యార్థులు ఉన్నారని, ప్రభుత్వం నిర్వహించే అనేక ఉద్యోగ నోటిఫికేషన్లలో ఈ కళాశాల విద్యార్థులే ఎక్కువగా ఉంటారని అన్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ. జి.నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ.ఎస్.జితేందర్ నాయక్, యూజీసీ డీన్ ప్రొ. బి.లావణ్య, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ప్రొ. సయద్ తలాత్ సుల్తాన, వైస్ ప్రిన్సిపాల్స్ డా.కొండా నాగేశ్వర్‌రావు, డా. బాలు నాయక్, డా. పి.స్వాతి, డా. సి.ఎస్. స్వాతి, వివిధ విభాగాల హెడ్స్, అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాంచందర్‌రావు ఫైటర్ కాదు - రైటర్ : బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు రాంచందర్‌రావు రైటర్ మాత్రమేనని, ఫైటర్ కాదని బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. కానీ వ్యక్తిగతంగా ఆయన మంచి వ్యక్తి అన్నారు. అమిత్ షా తనకు ఫోన్ చేశారని, బీజేపీలో చేరతారని వస్తున్న వార్తలపై ఆ పార్టీకి రాజీనామా చేసిన ఎమ్మెల్యే రాజాసింగ్ ఆదివారం కీలక వ్యాఖ్యలు చేశారు. అవన్నీ ఫేక్ వార్తలు అని, అమిత్ షా తనకు ఫోన్ చేశారని వార్తలు వస్తున్నాయని తాను అంతపెద్ద వ్యక్తిని కాదని రాజాసింగ్ అన్నారు. ఎప్పుడు కూడా అమిత్ షా తనకు ఫోన్ చేయలేదని , తాను చాలా చిన్నవ్యక్తిని అన్నారు. వాళ్లు పెద్ద మనుషులు అని ఎందుకు కాల్ చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఐదేళ్లపాటు కేంద్రానికి లేఖ రాశానని, తెలంగాణలో జరుగున్న తప్పుల గురించి లేఖలో పేర్కొన్నానని అన్నారు. కానీ అది వాళ్ల వరకు చేరిందో లేదో అని అప్పటికే తెలంగాణలో పెద్దతప్పు జరిగిందన్నారు. ఇప్పటివరకు



తెలంగాణ బీజేపీలో జరుగుతున్న సమస్యలను కేంద్రానికి చెప్పేవరకే ఎవరిని వదిలే ప్రసక్తిలేదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు తీవ్రఅన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీకి ఎవరితో నష్టం జరుగుతుందో అధికారంలోకి రాకుండా కుట్రలు ఎవరు చేస్తున్నారో వాటి వివరాలు బీజేపీ పెద్దలకు తప్పకుండా వివరిస్తానని తెలిపారు.

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారం చేపట్టాలంటే పార్టీకి ఫైటర?చ్చితంగా అవసరం ఉందన్నారు. తనపై కొందరు కుట్రలు చేస్తూ రాజాసింగ్ మళ్లీ పార్టీలోకి వస్తాడని సోషల్ మీడియాతో ప్రచారం చేస్తూ తన ప్రతిష్టను దిగజార్చే విధంగా పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పార్టీలో జరగుతున్న విషయాలను ఐబీ, ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి తెప్పించుకుంటుందని పేర్కొన్నారు. పార్టీని నాశనం చేస్తున్న వ్యక్తులను వదలిపెట్టే ప్రస్తకిలేదని, వారి అరాచకాలు, భాగోతం కేంద్ర పెద్దలకు వివరించే వరకు ఆపార్టీలో అడుగు పెట్టనని తేల్చి చెప్పారు.

## సాంఘిక సంక్షేమ గురుకులాలు సరికొత్త రికార్డు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నడుస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఈ ఏడాది పారదర్శకంగా, సమర్థవంతంగా, ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు పూర్తయ్యాయి. ఈసారి మొత్తం 17 వేలకుపైగా సీట్లు నింపడంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులం సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఎంపిక ప్రక్రియను నిష్పక్షపాతంగా, ముందుగానే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయడం గమనార్హం.

ఐఐటీ, నీట్ కోర్సులకు లక్ష్యంగా ఫౌండషనల్ సిఓఈలు : నీట్, ఐఐటి జేఈఈ, సిఎంఎ, క్లాట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల కోసం ప్రత్యేకంగా శిక్షణ అందించే 11 ఫౌండషనల్ ఈఎస్‌లో విద్యార్థులకు ఎంట్రన్స్ కోచింగ్‌ను అందిస్తున్నారు. ఈ ఏడాది వీటిలో 1,560 సీట్లు అందుబాటులో ఉండగా, 1,420 సీట్లు ఇప్పటికే నింపారు. ఇందులో ప్రవేశానికి ఎంపిక ప్రమాణాల ప్రకారం, సైన్స్ విభాగంలో 90 శాతం, ఆర్ట్ విభాగంలో 80 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఈ అడ్మిషన్ల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విద్యార్థుల ఎంపిక జరిగింది. మిగిలిన ఖాళీలను స్పాట్ అడ్మిషన్ల ద్వారా జూలై 31న భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

జిల్లా స్థాయి సిఓఈఎస్‌లలో : రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలవారీగా నడుస్తున్న 26 సిఓఈలలో ప్రవేశాలు తుది దశకు చేరుకున్నాయి. ఇక్కడ సైన్స్ విద్యార్థులకు 70 శాతం, ఆర్ట్, వొకేషనల్ విద్యార్థులకు 60 శాతం అర్హతగా నిర్ణయించారు. ప్రత్యేకంగా రూపొందించిన అకడమిక్ క్యాలెండర్, మైక్రో లెవెల్ ప్లానింగ్, నిపుణులైన అధ్యాపకులతో విద్యార్థులకు నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షల శిక్షణను అందిస్తున్నారు.

విద్యార్థుల ఎంపిక స్పష్టమైన ప్రక్రియ : ప్రవేశ ప్రక్రియను మే నెలలోనే పూర్తిచేయగా అనంతరం అభ్యర్థులు కోర్సులు మానేసిన లేదా హాజరుకాని కారణంగా




ఏర్పడిన ఖాళీలను నాలుగు విడతలుగా నిర్వహించి, జూలై మూడవ వారంలో పూర్తిగా భర్తీ చేశారు. ఇది గత ఏడాదితో పోలిస్తే గణనీయమైన పురోగతి సాధించింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులం చేపట్టిన పలు సంస్కరణలు వినూత్న మార్పులు, పారదర్శకత ఈ విజయానికి దోహద పడ్డాయి.

రుక్మాపూర్ సైనిక పాఠశాలలో– పూర్తయిన అడ్మిషన్లు : ప్రతి ఏడాది మాదిరిగానే రుక్మాపూర్ సైనిక పాఠశాలలో ఈ సంవత్సరం కూడా 100 శాతం అడ్మిషన్లు జరిగాయి. ప్రస్తుతం విద్యార్థులు కొన్ని కారణాలచేత జాయిన్ కానీ లేదా ఇతర పరిస్థితుల కారణంగా ఏవైనా ఖాళీలు ఉన్నా ఆ ఖాళీలను మెరిట్ ఆధారంగా అర్హులైనవారి చేత భర్తీ చేస్తున్నారు.

## లెక్కలు తెలుసుకుని మాట్లాడితే బెటర్

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రానికి యూరియా సరఫరా కొరతపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు వ్యవసా యరంగంపై కనీసం అవగాహన లేకుండా మాట్లాడడం విడ్డూరంగా ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి యూరియా కేటాయింపులు, సరఫరా అంశాలపై అవగాహన లేకుండా, రాష్ట్ర రైతాంగాన్ని తప్పుదోవ పట్టించేలా మట్లాడడం సరికాదని మంత్రి తుమ్మల హితవు పలికారు.ఆదివారం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావుకు యూరియా సరఫరాకు సంబంధించి పూర్తి లెక్కలతో మంత్రి తుమ్మల లేఖ రాశారు. యూరియాపై బిజెపివి అర్ధంలేని



మాటలని ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వ్యవసాయరంగంపై కనీసం అవగాహన లేకుండా, ఒక రాష్ట్రానికి పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ నిజనిజాలు బేరీజు వేసుకోకుండా మాట్లాడడం సరికాదని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసిందని చెప్పడం వారికి, వారి పార్టీకి రాష్ట్ర రైతాంగం పట్ల ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందన్నారు.

# జాతీయ రహదారిపై రాస్తారోకో....

ఎమ్మెల్యే గారు మీరు ఇచ్చిన హామీ నెరవేర్చండి.......
ఝురి- బి, ఝురి తాండ గ్రామస్తులు బెల్తారోడా చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై బైఠాయింపు....
రోడ్డుపై కిలోమీటర్ల కొద్ది నిలిచిపోయిన వాహనాలు....
ఇబ్బందులు పడ్డ వాహన దారులు ప్రయాణికులు......
శాంతిభద్రతలు అదుపు తప్పకుండా తన పోలీసు సిబ్బందితో పకడ్బందీ చర్యలు తీసుకున్న ముథోల్ సీఐ మల్లేష్,...
SJWHRC ప్రతినిధికి వినతి పత్రం అందించిన గ్రామస్తులు..



వ్యవసాయ పనులు ముగించుకొని, ఇంటి బాట పట్టిన మహిళలు, వంతెన పైనుండి ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగు





రోడ్డుపై నిరసన తెలుపుతున్న ప్రజలను శాంతింప చేస్తున్న పోలీసులు

నిర్మల్ జిల్లా తానూర్ జూలై 27 అమృత్ తెలంగాణ తానూర్ మండలం లోని ఝురి బి–ఝురి తాండ గ్రామస్తులు ఈ రోజు బెల్తారోడా చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి, వారి సమస్యను నిరసన రూపంలో తెలియజేశారు. తమ గ్రామానికి చిన్న వంతెన ఉండడం వలన, కొద్దిపాటి వర్షాలకు, రాకపోకలకు ఇబ్బంది అవుతుందని, అటువంటిది గత మూడు రోజులుగా వర్షాలు కురవడంతో రాకపోకలు లేవని, అనారోగ్యాలకు గురవుతే, ఆసుపత్రులకు వెళ్లలేని పరిస్థితి అని, ఉన్నత చదువుల కోసం తానూర్, బెల్తారోడ, బైంసా వెళ్లే విద్యార్థుల చదువులు అటకెక్కుతున్నాయని, పశువులకు గ్రాసం లేక ఇంటి దగ్గర విలవిలలాడుతున్నాయని వాపోయారు. ఉపాధ్యాయులు,ప్రభుత్వ అధికారులు సైతం గ్రామంలోకి సౌకర్యం లేక రాలేకపోతున్నారని,గత 20 సంవత్సరాల నుంచి ఎన్ని సార్లు మొరపెట్టుకున్న ఎవరు పట్టించుకునే నాధుడు లేడు అని, ప్రభుత్వ అధికారులు ఇక్కడికి వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కదలమని భీష్మించుకొని రోడ్డుపై కూర్చోగా, కిలోమీటర్ల పొడవుగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా SJWHRC ప్రతినిధులు డాక్టర్ సాప పండరికి గ్రామస్తులు వినతి పత్రం అందించగా, గ్రామస్తులతో సముదాయించి మాట్లాడుతూ, ఇట్టి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి, స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ దృష్టికి తీసుకువెళ్లి పెద్ద వంతెన నిర్మించేటట్టు మా ఆర్గనైజేషన్ తరపున ప్రయత్నిస్తామని అనడంతో, ప్రజలు నిరసన విరమించి సంతోషంగా వెళ్లిపోయారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముధోల్ సిఐ మల్లేష్, తానూర్ ఎస్సై జుబేర్ పటిష్టమైన బందోబస్తు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో SJWHRC బైంసా మండల ప్రతినిధులు అడెల్లి సాయికిరణ్, గంధమోల్ల ప్రకాష్,గ్రామస్తులు మేకల ఈశ్వర్,బాబన్న, ఆసం మాధవ్, గజానన్ బొడ్డొల్ల, నాగనాథ్, తమ్మల్ల మాధవ్, వందలాది సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు

# పిల్లలు కాదు పిడుగులు

## కరాటే పోటీలో సత్తా చాటిన విద్యార్థులు

ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ జూలై 27 తమిళనాడు రాష్ట్రంలోని పాండిచ్చేరి లో ఆదివారం జరిగిన ఆల్ ఇండియా ఛాంపియన్షిప్ కరాటే పోటీలలో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం నుండి కరాటే మాస్టర్ పసునూరి అవినాష్ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. కటాస్ స్పారింగ్ విభాగంలో మండల కేంద్రానికి చెందిన కుంట మధుశాలిని గౌడ్ అండర్ 21 ఇయర్స్ విభాగంలో ప్రథమ స్థానం గెలుపొందగా అండర్ 12 ఇయర్స్ విభాగంలో దండిక వికాస్ ద్వితీయ స్థానములో నిలిచారు. కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ట్రోఫీలను ప్రశంస పత్రాలను ఛాంపియన్షిప్ కరాటే ఆర్గనైజేషన్ నిర్వాహకులు అందజేశారు. కాగా ఆల్ ఇండియా ఛాంపియన్షిప్ పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి 1500 ల మంది కరాటే విద్యార్థులు పాల్గొన్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల డిస్ట్రిక్ట్ ఇన్స్ట్రక్టర్ మాస్టర్ పసునూరి అవినాష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులను గ్రామస్తులు పలువురు అభినందించారు.



ట్రోఫీ అందుకున్న కుంట మధుశాలిని, దండిక వికాస్

# మండల అధ్యక్షుల ప్రశిక్షణ తరగతులు......

## ముఖ్య అతిథిగా పాల్గొన్న సంఘటన మంత్రి చంద్రశేఖర్




మండలాల అధ్యక్షుల ప్రశిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి చంద్రశేఖర్ బీజేఎల్పి నేత ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి,



పాల్గొన్న బిజెపి మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు కార్యకర్తలు

నిర్మల్ జిల్లా జూలై 27 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కేంద్రంలో రెండవ రోజు నిర్వహించిన మండల అధ్యక్షుల ప్రశిక్షణ తరగతుల కార్యక్రమంలో రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్, బిజెఎల్పి నేత ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, ఎంపీ గోడం నగేష్, సహచర ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రామారావు పటేల్, మండలాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు సీనియర్ నాయకులుకార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# ప్రమాణం స్వీకారం చేసిన మాజీ ఎంపీ సోయం బాపూరావు

## శుభాకాంక్షలు తెలిపిన సమావేశం హాజరై బోరంచు శ్రీకాంత్ రెడ్డి





శుభాకాంక్షలు తెలిపిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : రాజ్ గౌడ్ సేవా సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా మాజీ ఎంపీ సోయం బాపూరావు గౌర్ నియమితులైన సందర్భంగా ఎస్టియు భవన్‌లో జరిగిన ప్రమాణ స్వీకార మహోత్సవం వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు టిపిసిసి ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క, అదిలాబాద్ డిసిసిబి చైర్మన్ ఆడ్డి బోజారెడ్డి, ఆసిఫాబాద్ మాజీ శాసనసభ్యులు ఆత్రం సక్కు, తో కలిసి తెలంగాణ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకోగా సోయం బాపురావు ప్రమాణస్వీకారం చేయడం జరిగింది. కార్యక్రమంలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ లు ఆడే గజేందర్, కంది శ్రీనివాస్ రెడ్డి మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, గోవర్ధన్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని గుడిహత్నూర్, బోథ్ మండలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (PACS) కేంద్రాలు, గోదాములను ఆదివారం ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్ , జిల్లా కలెక్టర్ రాజర్షి షా తో కలిసి సందర్శించారు.









అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఈ సందర్భంగా PACS కేంద్రాల్లో అమలవుతున్న ఆన్‌లైన్ పేమెంట్ విధానం, ఎరువుల నిల్వలు, పంపిణీ తదితర అంశాలను సమీక్షించారు. PACS , ARSK వంటి దుకాణాల్లో సరిపడా ఎరువుల నిల్వలు ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఎరువుల దుకాణంలో గత వారపు సగటు అమ్మకాలను ఆధారంగా చేసుకుని రానున్న నాలుగు రోజుల అవసరాన్ని గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే e-POS మెషీన్‌ల ద్వారా ఎరువుల అమ్మకాల వివరాలను తన ఆధార్ కార్డుతో స్వయంగా పరిశీలించారు. సాంకేతికత వినియోగం ద్వారా వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందిస్తున్న PACS సిబ్బంది పనితీరును ఆయన ప్రశంసించారు. అనంతరం బోథ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన వార్డులను పరిశీలించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ప్రత్యేక వైద్యం అందించాల్సిందిగా వైద్యాధికారులను ఆదేశించారు. ప్రత్యేక అధికారి ఆదేశాల మేరకు 3 సంవత్సరాల (స్వీటీ) చిన్నారిని బోథ్ PHC నుండి అదిలాబాద్ రిమ్స్ఆసుపత్రికి తరలించి,పిల్లలవార్డులో అవసరమైన పరీక్షలు, చికిత్సలు అందిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డా. నరేందర్ రాథోడ్ తెలిపారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని, లేచి నడుస్తుందని, పిడియాట్రిషన్ సలహామేరకు అవసరమైతే హైదరబాద్ కు తరలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని, రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పన, మందుల నిల్వలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అవసరమైన మందుల ఇండెంట్లను సమయానికి పంపిస్తూ సేవలలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్ , నిన్న,ఈ రోజు రెండు రోజుల పాటు నిర్వహించిన సమావేశం, పర్యటనలో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు dco మోహన్, dao శ్రీధర్ స్వామి, తహసీల్దార్ కవిత, dmho నరేందర్ రాథోడ్, adl dmho మనోహర్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


# లైసెన్స్ ల్యాండ్ సర్వేయర్ ల అర్హత పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్ లో ఏర్పాటు చేసిన లైసెన్స్ ల్యాండ్ సర్వేయర్ ల అర్హత పరీక్ష కేంద్రాన్ని ఆదివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ రాజర్షి షా , అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పరీక్షా కేంద్రాలను, హాజరు శాతాన్ని పరిశీలించి, మొత్తం అభ్యర్థులు 155 మంది .కాగా అందులో లైసెన్స్ సర్వేయర్ పరీక్షకు ఉదయం , మధ్యాహ్నం పరీక్షకు హాజరైన అభ్యర్థులు 129 మంది హాజరుకాగా 26 మంది గైర్హాజరయ్యారని ,అన్నారు. కలెక్టర్ వెంట ప్రత్యేక అధికారి రాజాలింగు, సర్వే లాండ్ అధికారి, ప్రిన్సిపల్,, తదితరులు ఉన్నారు.

# జిపిఓ, లైసెన్స్ సర్వేయర్ పరీక్ష కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు.





జిపిఓ పరీక్ష కేంద్రం, చాణక్య హై స్కూల్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : జిపిఓ (గ్రామ పాలన అధికారులు), లైసెన్స్ సర్వేయర్ల నియామక పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అదనపు కలెక్టర్ (రెవెన్యూ)తో కలిసి పట్టణంలోని చాణక్య హై స్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష గదుల్లో జరుగుతున్న పర్యవేక్షణ, అభ్యర్థుల హాజరు, నిబంధనలు పాటింపు, ప్రశ్న పత్రాల పంపిణీ వంటి అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పరీక్షలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు జిపిఓ పరీక్షకు మొత్తం 55 మంది అభ్యర్థులు హాజరుకావలసి ఉండగా, 37 మంది మాత్రమే హాజరయ్యారని 18 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. అలాగే లైసెన్స్ సర్వేయర్ పరీక్షకు 110 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 84 మంది హాజరైనట్టు కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్డీవో రత్నకళ్యాణి, నోడల్ అధికారి ఆర్. సుదర్శన్, పర్యవేక్షకులు మోతీరాం, సూర్యారావు, రాజేశ్వర్ గౌడ్, తహసిల్దార్ రాజు, పోలీసు సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బాధితులకు సెల్ ఫోన్లు అప్పగింత

పాపన్నపేట : అమృత్ తెలంగాణ: సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు సంబంధించిన ఏడు సెల్ ఫోన్లు రికవరీ చేసి వారికి అప్పగించినట్లు పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. వీటిని సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేశామన్నారు. ఇప్పటివరకు తాము 300 కు పై చిలుకు సెల్ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామన్నారు. అయితే ఎవరైనా సెల్ ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఎస్సై సూచించారు. తమ సెల్ఫోన్లను ఎస్ఐ వెంటనే రికవరీ చేయడం పట్ల బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలి

**వర్షాలకు సంబంధించి ప్రతి ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూసి తక్షణ చర్యలు చేపట్టాలి**
**సాత్నాల, మత్తడి వాగు, పెన్ గంగ, ఛనక ప్రాజెక్టుల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి**
**ముఖ్యంగా గిరిజన మారుమూల ప్రాంతాల ప్రజల పై ప్రత్యేక దృష్టి సారించాలి**
**వేడి చేసిన నీటిని తాగేలా అవగాహన కల్పించాలి**
**ట్యాంకులను శుభ్రం చేయాలి**
**ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి రాష్ట్ర ఆబ్కారీ కమిషనర్ సి. హరికిరణ్**






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : గత మూడురోజులుగా ఏకధాటిగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర ఆబ్కారీ కమిషనర్ సి. హరికిరన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఆయన జిల్లా పాలనాధికారి రాజర్షి షా తో కలిసి భారీ వర్షాలు, సీజనల్ వ్యాధులు, యూరియా ఎరువుల నిల్వలు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల ఎక్కడ కూడా ప్రాణనష్టం సంభవించకుండా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా జిల్లాలో గల శివ సాగర్ ప్రాజెక్ట్, కల్వర్టులు, వంతెనలు తదితర ఏరియాలలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. పరీవాహక ప్రాంతంతో పాటు కాలువలు, చెరువులు, ఇతర జలాశయాలలో చేపలు పట్టడానికి ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తక్షణమే స్పందించేలా ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహా, ఆయా శాఖలు సన్నద్ధమై ఉండాలని, క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. వరద జలాలు ప్రవహించే ప్రాంతాల మీదుగా ప్రజలు రాకపోకలు సాగించకుండా నిషేధం విధించాలన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. ఇటీవలే జిల్లాలో జలదిగ్బంధంలో చిక్కుకున్న సంఘటనలు నెలకొన్నాయని గుర్తు చేస్తూ, అలాంటి ప్రదేశాలకు ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరూ వెళ్లకుండా కట్టడి చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే, అవసరమైన పక్షంలో రాష్ట్రం నుండి సహాయక బృందాలు పంపించేలా చూస్తామని, స్థానిక పరిస్థితుల గురించి జిల్లా యంత్రాంగం ద్వారా ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ, భారీ వర్షాల వల్ల వరద పరిస్థితి నెలకొంటే సమర్ధవంతంగా ఎదుర్కోవాలని అన్నారు. పురాతన, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్న వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని , వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచే ప్రాంతాల పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని అన్నారు. ఎక్కడ కూడా చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా పరిస్థితులను పర్యవేక్షించాలని అన్నారు.

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగానే కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సిబ్బందిని, మందులను అందుబాటులో ఉంచాలని, గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు, అతిసారం వంటివి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆన్నారు.

వానాకాలం సీజన్ పంటల సాగుకు అవసరమైన ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని, అన్ని ప్రాంతాల రైతులకు ఎరువులు సరఫరా అయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్ తో పాటు అగ్నిమాపక శాఖ, పోలీస్, మున్సిపల్ తదితర కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే ప్రజలు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 18004251939 కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని సూచించారు. భారీ వర్షాల పరిస్థితి గురించి వాతావరణ శాఖ అందిస్తున్న సూచనలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ అప్రమత్తం చేస్తున్నామని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితి ఏర్పడితే స్థానికులను తరలించేలా పునరావాస కేంద్రాలను కూడా గుర్తించి తగిన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్ లు, చెరువులలో వచ్చి చేరుతున్న వరద జలాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేస్తున్నామని అన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా యూరియా కొరత లేదని, అన్ని విక్రయ కేంద్రాల్లో స్టాక్ వివరాలతో కూడిన బోర్డు ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ సలోని, rdo స్రవంతి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# సరిహద్దు గ్రామాల ప్రజలు అక్రమ రవాణాలను అడ్డుకోవాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

**విద్యార్థులకు చదువు యొక్క ప్రాధాన్యతను తెలియజేసి, ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలి.**
**వర్షాకాలం దృష్ట్యా జలపాతాలు, నదులు, వాగులను ఈతలకు విద్యార్థులు వెళ్లకుండా ఉండాలి.**
**జిల్లాలో భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచన**
**యువత గంజాయి, పేకాట, మట్కా లాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి**
**విడీసీ ల ఏర్పాటు రాజ్యాంగ విరుద్ధం, వీడీసీ అక్రమాలపై ఫిర్యాదు చేయాలి.**
**కోరాట, గిమ్మ, తర్నం గ్రామాల ప్రజలతో పోలీసు మీకోసం కార్యక్రమం.**
**చనక-కోరాట ప్రాజెక్ట్ ను సందర్శించి నీటి ప్రవాహాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ**
**పెన్ గంగా బ్రిడ్జి వద్ద నది ప్రవాహం పరిశీలన.**
**మూడు గ్రామాల యువతకు స్పోర్ట్స్ కిట్స్ అందజేత.**
**ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని సూచన**







ఆదివారం జైనథ్ మండలం లోని మహారాష్ట్రతో సరిహద్దుతో ఉన్న చనాక కోరాట ప్రాజెక్టును జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సందర్శించి నది ప్రవాహ పరిస్థితులను పరిశీలించారు. అదేవిధంగా పెన్ గంగా బ్రిడ్జి వద్ద నది ప్రవాహాన్ని పరిశీలించి యువత ఈతకు రాకుండా తగు జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా సన్మార్గం వైపు పయనించేలా కొరాట, గిమ్మ, తర్నం మూడు గ్రామాల ప్రజలు యువతతో పోలీసు మీకోసం కార్యక్రమాలు ఏర్పాటు చేసి చైతన్య పరిచయం జరిగింది. జిల్లాలో భారీ వర్షాలు దృష్ట్యా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, బ్రిడ్జిల పైనుండి వరదలు ప్రవహిస్తున్నప్పుడు వాటిని దాటకుండా ఉండాలని, అత్యంత వర్షం పడినప్పుడు ఉరుములు వచ్చినప్పుడు చెట్ల కింద ఉండకుండా ఉండాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల ప్రజలను ఉద్దేశించి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యంగా మహారాష్ట్ర తో సరిహద్దుతో ఉన్నందున అక్రమంగా దేశదారు తరలించకుండా యువత చెడు వ్యసనాల బారిన పడకుండా ప్రజలు జిల్లా పోలీసు యంత్రాంగానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. గ్రామాలలో వీడీసీ వ్యవస్థ రాజ్యాంగ విరుద్ధమని, విడిసి ల ద్వారా ఎలాంటి అక్రమ పరిస్థితులు నెలకొన్న దానికి జిల్లా పోలీస్ యంత్రాంగానికి తెలియజేయాలని సూచించారు. అలాగే యువతకు విద్యార్థులకు చదువు యొక్క ప్రాధాన్యతను తెలియజేసి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రామాలలో గంజాయిని పండించకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గంజాయి వల్ల యువత భవిష్యత్తును కోల్పోతూ ప్రభుత్వ పథకాలు వర్తించకుండా ఉంటాయని గమనించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా యువత విద్యార్థులు జలపాతాలు, నదులు వాగులు వంటి వాటి వద్ద జాగ్రత్తలు వహించాలని, ఈతరానివారు వాటి వద్దకు వెళ్ళరకుండా ఉండాలని తెలిపారు. లోతట్టు బ్రిడ్జిల పైనుండి నీటి ప్రవాహం జరిగినప్పుడు వాటిని దాటకుండా ఉండాలని పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. యువత చదువుతోపాటు క్రీడారంగంలో కూడా అభివృద్ధి చెందాలని మూడు గ్రామాల ప్రజలకు యువతకు మూడు వాలీబాల్ స్పోర్ట్స్ కిట్స్ అందజేసి ప్రోత్సహించారు. చెడు వ్యసనాల బారినపడిన యువతకు ప్రత్యేకంగా డౌ సెంటర్ల ద్వారా చికిత్స అందించి నయం చేకూర్చవచ్చని తెలిపారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ద్విచక్ర వాహనదారులు ముఖ్యంగా హెల్మెట్ ను ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, జైనథ్ సీఐ డి సాయినాథ్, ఎస్సై గౌతమ్, మూడు గ్రామాల ప్రజలు పెద్దలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసి చట్టాలను నిర్వీర్యం చేస్తుంది:ఆత్రం సుగుణక్క





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ఆదిలాబాద్: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలపై దెబ్బ కొట్టి, ఆదివాసి చట్టాలను నిర్వీర్యం చేస్తుందని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్టియు భవనంలో రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంపీ సోయం బాపూరావు ప్రమాణ స్వీకార మహోత్సవానికి సుగుణక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ రాజ్ గోండ్ సేవా సమితి పార్టీలకతీతంగా ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేయాలని కోరారు. ఖనిజ సంపద మొత్తం ఆదివాసీలు నివసిస్తున్న అడవుల్లోనే ఉంది కాబట్టి, వారిని అడవుల్లో నుంచి వెళ్లగొట్టి కనిజ సంపదను అంబానీ, ఆధానీలకు కట్ట పెట్టేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. ఆదివాసి చట్టాలను తుంగలో తొక్కుతూ వారి అభివృద్ధిని అడ్డుకుంటున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలని, దేశంలోని ఆదివాసీలు అందరూ ఏకమయ్యి ఆదివాసి చట్టాలను, అడవులను కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని పేర్కొన్నారు. గొండ్వాన జాతీయ నాయకులు సిడాం అర్జున్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డిసిసిబి చైర్మన్ అడ్డి భోజరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్, బోత్ నియోజకవర్గాల ఇన్చార్జిలు కంది శ్రీకాంత్ రెడ్డి, ఆడే గజేందర్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మడి జిల్లాకు సంబంధించిన రాజ్ గోండ్ సేవా సమితి నాయకులు, గోండ్వాన పంచాయతీ రాయ్ సెంటల సార్ మెడీలు, పటేల్స్, దేవరీ, మహాజన్ లు, తొమ్మిది తెగల ఆదివాసీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో ఒకరి మృతి.....



విద్యుత్ షాక్ తో మృతి చెందిన గంగయ్య

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి జూలై 27 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని టెంబుర్ని గ్రామానికి చెందిన కోసరి గంగయ్య, 46 రోజు మాదిరిగా తన యొక్క కిరాణా షాపును తెరిచి కిరణ షాప్ లోపల క్లీన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ఫ్రిజ్ యొక్క కరెంటు వైర్ తన చేతికి తగలడంతో విద్యుత్ షాక్కు గురై పడిపోవడంతో. గమనించిన గ్రామస్తులు వెంటనే 108 సమాచారం అందించి అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం నిర్మల్ ఏరియా హాస్పిటల్ కు తరలించగా డ్యూటీ డాక్టర్ చూసి గంగయ్య చనిపోయినాడని చెప్పడంతో భార్య కోసారి వనజ, నర్సాపూర్ జి పోలీస్ స్టేషన్ యందు దరఖాస్తు ఇవ్వగా ఎస్ఐపి గణేష్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టిరు.

# దాతలు స్పందిస్తేనే.. తండ్రి అంత్యక్రియలు



రాయికల్ : అమృత్ తెలంగాణ: జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని కోరుట్ల క్రాసింగ్ వద్ద రోడ్డు పక్కన గల ఓ కూలీపోయిన ఇంటిలో అద్దెకు జీవించే జాంగిర్ కుటుంబం ప్రస్తుతం తీవ్రమైన విషాదంలో కొట్టుమిట్టాడుతోంది. సీస కమ్మరి వృత్తితో కుటుంబాన్ని పోషిస్తున్న నరాల జాంగిర్ హఠాన్మరణంతో మరణించారు. ఆయన ఇద్దరు కూతుళ్లు నాగమణి, నాగేశ్వరి కన్నీటి విన్నపంతో దాతల ఆర్థిక సాయానికి ఎదురుచూస్తున్నారు. జాంగిర్ భార్య అనసూయ కిడ్నీ వ్యాధి సమస్యలతో పోరాడుతుండగా.. కుమార్తెల పెళ్లిళ్లు కూడా చేయలేని పరిస్థితిలో, కూలిపనులపై ఆధారపడుతూ జీవనం సాగించేవాడు. గత సంవత్సరం కొడుకును కోల్పోయిన ఈ కుటుంబానికి ఇప్పుడు తండ్రి మరణం మరింత విషాదాన్ని మిగిల్చింది. కుటుంబ పెద్దను కోల్పోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న కుమార్తెలు తండ్రి అంత్యక్రియలు జరిపేందుకు సైతం డబ్బు లేక కన్నీటిలో మునిగి దాతల వైపు ఆశగా చూస్తున్నారు. తండ్రి మృతదేహం ముందు కూర్చుని ఎవరైనా దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం చేస్తారా అంటూ వారిద్దరూ విన్నవిస్తున్న దృశ్యం ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది. మానవత్వాన్ని చాటుకుని, ఈ కుటుంబానికి అండగా నిలవాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్థిక సహాయం చేసే దాతలు నర్రా అనసూయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాయికల్ బ్రాంచ్ ఖాతా నెంబరు 42050569724 ఐఎఫ్ సి కోడ్ 20264 యందు సహాయం చేయాలని, వస్తు రూపేనా నేరుగా అనసూయ 9177748525 నెంబర్ యందు సంప్రదించవచ్చని కోరుతున్నారు.

# కేటీఆర్ జన్మదిన వేడుకలు ఉపాధ్యాయుడు సస్పెండ్




మంచిర్యాల:అమృత్ తెలంగాణ: మంచిర్యాల జిల్లా చెన్నూరులోని ఎన్‌పీ వాడ జడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆర్కె ప్రసాద్ అనే ఉపాధ్యాయుడ్ని ఉన్నతాధికారులు శనివారం సస్పెండ్ చేశారు. ఈ నెల 24న మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించినందుకుగాను గవర్నమెంట్ స్కూల్ టీచర్‌పై వేటు పడింది. ఈ ఘటనను విద్యాశాఖ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలను రాజకీయ కార్యక్రమాలకు వేదికగా మార్చడంపై సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి. జులై 24న సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎన్‌పీ వాడ జడ్పీహెచ్ పాఠశాలలో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు కుర్చీలను పంపిణీ చేశారు. ఇక్కడి వరకు బాగానే ఉంది. బీఆర్ఎస్ కండువాలు వేసుకున్న నాయకులు.. పాఠశాలలో జై తెలంగాణ, జై కేసీఆర్, జై కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు. విద్యార్థులతో సైతం నినాదాలు చేయించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఈ విషయం విద్యాశాఖ ఉన్నతాధికారుల వరకు చేరింది. పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా ఈ చర్యలు ఉండడంతో.. జిల్లా విద్యాధికారి యాదయ్య విచారణ జరిపి ఆ రోజు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడిగా వ్యవహరించిన ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# గురుకుల ఘటనపై హైకోర్టు సుమోటోగా కేసు స్వీకరించాలి: హరీష్ రావు




తిమ్మాజిపేట :అమృత్ తెలంగాణ: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గురుకులాల్లో జరుగుతున్న సంఘటనపై సుమోటోగా కేసు స్వీకరించాలని మాజీ మంత్రి హరీశ్ రావు రెండు చేతులెత్తి జోడించి అభ్యర్థించారు. నాగర్ కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి హరీష్ రావు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, గువ్వల బాలరాజ్ తో కలిసి ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఉన్న ఉయ్యాలవాడ గురుకుల పాఠశాలలో చాతున్న విద్యార్థులను పరామర్శించారు. ఇందులో భాగంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.

ప్రభుత్వం చేతగానితనం, నిర్లక్ష్యం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. మేము వస్తున్న విషయం తెలుసుకొని హడావుడిగా పోలీసులను పెట్టి పిల్లలను తీసుకొచ్చి హాస్పిటల్లో చేర్పించారు. ఇంకొంతమంది విద్యార్థులకు చేతికి క్యాండిల్ తోనే చెట్టు కింద కుర్చీలో కూర్చోబెట్టి చికిత్స అందిస్తున్నారు. ఎందుకు దాచి పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించారు. పిల్లలకు మంచి భోజనం పెట్టకుండా, వారికి సరైన వైద్యం అందించకుండా ఎందుకు హడావిడిగా తీసుకొచ్చారు. ఈ రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇలాంటి ఘటనలే జరుగుతున్నాయని అన్నారు. ఇదే నాగర్ కర్నూలు జిల్లాలో కొన్ని రోజుల క్రిందటనే పెద్దకొత్తపల్లి హాస్టల్లో విషపూరిత ఆహారం తిని ఆసుపత్రి పాలయ్యారు. అలాగే జగిత్యాల, భద్రాద్రి కొత్తగూడెంలలో విషాహారం తిని ఆస్పత్రి పాలయ్యారు. రాష్ట్రంలో ప్రతిరోజు పేపర్లో, టీవీల్లో ఏదోచోట గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఆస్పత్రుల పాలైన వార్తలు చూడవలసి వస్తుందన్నారు.

20 నెలల రేవంత్ రెడ్డి పాలనలో వంద మంది గురుకుల విద్యార్థులు చనిపోయారు. వందమంది విద్యార్థులు చనిపోయినా మీ గుండె కరగదా రేవంత్ రెడ్డి. గురుకుల విద్యార్థుల గురించి పట్టించుకోవా.? బావి భారత పౌరులైన ఈ విద్యార్థుల భవిష్యత్తుపైన మీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా? పిల్లలకు కడుపునిండా అన్నం పెట్టడం కూడా చేతకాదా ఈ ప్రభుత్వానికి రేవంత్ రెడ్డి బాలల దినోత్సవం నాడు ఎక్కడైనా ఫుడ్ పాయిజన్ అయితే అధికారులను సస్పెండ్ చేస్తా అని ప్రగల్బాలు పలికాడు. నువ్వే విద్యాశాఖ మంత్రివి నీ సొంత జిల్లా మహబూబ్ నగర్ లో విద్యార్థులు ఆస్పత్రి పాలైతే కూడా స్పందించవా.. అందాల పోటీల్లో లక్ష రూపాయలకు ప్లేట్ భోజనం పెట్టావు అందాల భామలను చూడడానికి అందాల పోటీలకు ఐదుసార్లు పోయావు. మరి అనారోగ్యానికి గురైన ఈ పిల్లలను చూడడానికి ఆస్పత్రికి రావా అని ప్రశ్నించారు.

ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలు ఆసుపత్రి పాలైతుంటే వాళ్ళని పరామర్శించాలని ఎందుకు మీకు అనిపించదు వారికి మంచి భోజనం పెట్టాలని ఎందుకు నీకు అనిపించదు. కేసీఆర్ ఆనవాళ్లు మారుస్తా అంటే ఏమిటి రేవంత్ రెడ్డి ఆనవాళ్లు మార్చడం అంటే విద్యార్థులు గురుకుల నుండి టీసీలు తీసుకుని వెళ్లిపోవడమా అని మండిపడ్డారు. ఆనవాళ్లు మార్చడం అంటే గురుకుల పిల్లలను ఆస్పత్రి పాలు చేయడమా? ఆ పిల్లలను పొట్టన పెట్టుకోవడమా? కేసీఆర్ 284 గా ఉన్న గురుకులాలను 1,023 గురుకులాలకు పెంచిండు. 1,60,000 మంది ఉన్న గురుకులాల్లో కేసీఆర్ ఆరు లక్షల మంది విద్యార్థులు చదివే సౌకర్యాలు కల్పించారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి గురుకులాలను ఆగం చేశాడు. ఇంటిగ్రేటెడ్ స్కూలు పెడతా అని డబ్బా కొట్టిన రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాల్లో ఒక ఇటుక పెట్టింది లేదు.

ఒక స్కూల్ కట్టింది లేదు. ఉన్న గురుకుల విద్యార్థులకు అన్నం పెట్టకుండా ఏడిపించే పరిస్థితి ఉంది రాష్ట్రంలో ఒక విద్యార్థిని తల్లి రూప అనే మహిళ నన్ను కలిశారు. వారు బండై గుట్ట గ్రామం కొల్లాపూర్ నుంచి వచ్చారు నిన్న వారి బిడ్డ కలుషిత ఆహారం తిని ఆసుపత్రిపాలైందని తెలిసి వచ్చింది. ఆదివారం రోజు విద్యార్థులకు పెట్టవలసింది పూరి, చపాతి. కానీ ఉదయం పెట్టింది సాంబారు అన్నం ఆ సాంబార్లో కూడా పురుగులు వచ్చాయని ఆ తల్లి స్వయంగా చూసి చెప్పిందని అన్నారు. గురుకులాల్లో మెనూ కూడా ఈ ప్రభుత్వం పాటించడం లేదు. ప్రతీరోజు ఏదో ఒక జిల్లాలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు అన్ని జిల్లాలో రోజుకి 100 మంది విద్యార్థులు ఆసుపత్రి పాలవుతున్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన సంఘటన ఆరు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్లక్ష్యం చేసి వారి జీవితాలతో ముఖ్యమంత్రి చెలగాటమాడుతున్నాడు.

పిల్లల భవిష్యత్తుతో చెలగాటమాడకండి. బీఆర్ఎస్ మీ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చూస్తూ ఊరుకోదన్నారు. మళ్లీ గురుకుల బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాం. హ్యూమన్ రైట్స్ కమిషన్ సుమోటోగా తీసుకొని రాష్ట్రంలో గురుకుల హాస్టల్స్ లో జరుగుతున్న సంఘటనలపై విచారణ చేసి సుమోటో గా కేసు తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కి రెండు చేతులు జోడించి అభ్యర్థించారు. బీసీ హాస్టల్లో ఇంకా బెడ్ షీట్స్ రాలేదు, కాస్మోటిక్ బిల్లులు రాలేదు. కొన్ని హాస్టల్లో ఇంకా విద్యార్థులకు బట్టలు కూడా రాలేదని అన్నారు. రాజకీయాలు ఉంటే ఎన్నికలప్పుడు చేసుకుందాం. కేసీఆర్ మీద మా మీదన కోపం ఉంటే కేసులు పెట్టు కానీ విద్యార్థులను ఇబ్బంది పెట్టకు. నీ రాజకీయాల కోసం పిల్లల భవిష్యత్తుతో ఆడుకోవద్దని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని చరించారు.

# అస్వస్థతకు గురైన విద్యార్థినిలను పరామర్శించిన సీపీఐ(ఎం) బృందం



అచ్చంపేట :అమృత్ తెలంగాణ: జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థినిలను ప్రభుత్వ ఆస్పత్రిలో సీపీఐ(ఎం) బృందం పరామర్శించింది. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శ్రీనివాస్, లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫుడ్ పాయిజన్ కు కారణాలు తెలుసుకొని బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాల్సిన భాద్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కందికొండ గీత, జిల్లా కమిటీ సభ్యులు పొదిలి రామయ్య, గుంపల్లి అశోక్, తారా సింగ్ జిల్లా నాయకులు నాగపూర్ మధు కురుమయ్య ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్.. 64 మంది విద్యార్థినులకు అస్వస్థత



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడలో గల మహాత్మాజ్యోతిరావుపులై బాలికల గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి ఆహారం వికటించి 64 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాల సిబ్బంది సాయంత్రం సమయంలో విద్యార్థినులకు స్నాక్స్ పకోడి అందించారు. తరువాత రాత్రి భోజనం క్యాబేజీ కూరతో ఏర్పాటు చేశారు. భోజనం చేసిన కొద్దిసేపటికే తొమ్మిది మంది విద్యార్థినులకు కడుపునొప్పితో పాటు వాంతులు కావడంతో సిబ్బంది గమనించి వెంటనే జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు అందించారు. ఆ తరువాత క్రమంగా విద్యార్థినుల సంఖ్య 50 వరకు పెరిగింది. ఆదివారం ఉదయం వరకు విద్యార్థుల సంఖ్య 64 పెరిగింది. కడుపునొప్పి, వాంతులతో బాధపడుతున్న విద్యార్థినులను 108 అత్యవసర వాహనంలో ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు.

# తమన్నా తళుకు బెళుకులు.. చూస్తూ ఉండిపోవాల్సిందే..!



మిల్కీ బ్యూటీ తమన్నా బాలీవుడ్ మూవీ చంద్ స రోషన్ చెహ్రా సినిమాతో తెరంగేట్రం చేయగా శ్రీ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత రెండేళ్లు తమిళ సినిమాల్లో నటిస్తూ వచ్చిన అమ్మడు మళ్లీ హ్యాపీడేస్ తో తెలుగులో నటించింది. హ్యాపీడేస్ సూపర్ హిట్ అవడంతో తమన్నాకి టాలీవుడ్ లో సూపర్ క్రేజ్ ఏర్పడింది. ఇక అక్కడ నుంచి ముందు యువ హీరోలతో నటించి ఆ తర్వాత స్టార్ ఛాన్సులు అందుకుంది అమ్మడు. సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి దాదాపు 20 ఏళ్ల కావొస్తున్నా ఇప్పటికీ యువ హీరోయిన్స్ కి పోటీ ఇస్తూ వరుస సినిమాలు చేస్తుంది తమన్నా. కేవలం హీరోయిన్ గానే కాదు అమ్మడు స్పెషల్ సాంగ్స్ కి కేరాఫ్ అడ్రెస్ గా మారింది. హీరోయిన్స్ లో కొద్దోగొప్పో డ్యాన్స్ చేస్తూ అలరించే తమన్నాతో జోడీ కట్టేందుకు స్టార్స్ కూడా ఆసక్తి చూపించారు. స్టార్ హీరోలతోనే కాదు సీనియర్ స్టార్స్ తో కూడా తమన్నా జత కట్టింది. చిరంజీవివి నాగార్జున వంటి స్టార్స్ తో కూడా తమన్నా నటించింది. ఇప్పటికీ ఓ పక్క సీనియర్ ఫస్ట్ బెస్ట్ ఆప్షన్ గా తమన్నా తన సత్తా చాటుతుంది. మరోపక్క యువ హీరోలతో కూడా కలిసి చేసేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తుంది. తెలుగుతో పాటుగా తమిళ హిందీ పరిశ్రమల్లో కూడా తమన్నా సూపర్ క్రేజ్ తెచ్చుకుంది.

# అతని ప్రవర్తనతో చాలా భయపడ్డా!



ప్రతీ ఇండస్ట్రీలో హీరోయిన్లకు కొన్ని నియమాలుంటాయని, అవి అన్ని చోట్లా ఒకేలా ఉండవని ప్రముఖ నటి మాళవికా మోహనన్ తెలిపింది. ప్రతీ ఇండస్ట్రీలో హీరోయిన్లకు కొన్ని నియమాలుంటాయని, అవి అన్ని చోట్లా ఒకేలా ఉండవని ప్రముఖ నటి మాళవికా మోహనన్ తెలిపింది. సౌత్ లో కనిపించాలంటే హీరోయిన్ మరీ సన్నగా ఉండకూడదని, అలా ఉంటే తప్పని శరీరాకృతి విషయంలో తాను ఎన్నో ఛాలెంజెస్ ఎదుర్కొన్నట్టు మాళవికా తెలిపింది. ఒకప్పుడు తనపై ఎన్నో విమర్శలు వచ్చాయని మాళవిక వెల్లడించింది. గతంలో తనపై వచ్చిన విమర్శలు తనను ఎంతగానో బాధించాయని చెప్తూ తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని మాళవిక బయటపెట్టింది. ఒకరోజు రాత్రి తాను ఫ్రెండ్స్ తో కలిసి ముంబైలోని లోకల్ ట్రైన్ లో జర్నీ చేశానని, ఆ జర్నీ టైమ్ లో తనని ఒకతని ప్రవర్తన చాలా భయపెట్టిందని మాళవికా మోహనన్ తెలిపింది. మరో సినిమాను ఓకే చేసిన ప్రభాస్ జర్నీ చేస్తున్న టైమ్ లో ఆ కంపార్ట్మెంట్లో తను, తన స్నేహితులు తప్ప ఎవరూ లేరని, ఆ టైమ్ లో ఒకతను తమ కంపార్ట్మెంట్ లోకి వచ్చేందుకు ట్రై చేశాడని, అక్కడున్న గ్లాస్ డోర్ నుంచి తొంగిచూస్తూ ముద్దిస్తావా అని సైగలు చేశాడని, అతని ప్రవర్తన తనను, తన ఫ్రెండ్స్ ను భయపడేలా చేసిందని, ఆ టైమ్ లో అసలేం చేయాలో అర్థం కాలేదని మాళవిక వెల్లడించింది. అలా భయపడుతూ ఉండగా ట్రైన్ మరో స్టేషన్ కు వచ్చిందని, అక్కడ తమ కంపార్ట్మెంట్ లోకి మరికొంత మంది వచ్చాక తమ భయం మొత్తం పోయిందని మాళవిక తెలిపింది. ఇక హీరోయిన్ లుక్స్ విషయంలో కూడా మాళవిక మాట్లాడింది. కొంచెం బరువు పెరిగి నార్త్ లో సినిమా చేయాలనుకుంటే అక్కడ ఛాన్సులు రావని, నార్త్ సినిమా కోసం కొంచెం సన్నబడి తిరిగి సౌత్ కు వస్తే ఇక్కడ బొద్దుగా ఉంటేనే బావుంటావంటారని మాళవిక తనకు ఎదురైన అనుభవాలను చెప్పుకొచ్చింది. దీంతో ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తల్లో కన్ఫ్యూజ్ అయ్యానని, తర్వాత మెల్లిగా సిట్యుయేషన్స్ అర్థమయ్యాయని ఏదేమైనా ఫిట్‌గా, హెల్తీగా ఉండాలని డిసైడ్ అయినట్టు అమ్మడు తెలిపింది. తన కెరీర్ స్టార్టింగ్ లో సన్నగా ఉన్నానని ఎంతోమంది ట్రోల్ చేశారని, ఆ తర్వాత కొంచెం లావు అయ్యేసరిగా అప్పుడు కూడా తనను విమర్శించారని చెప్పిన మాళవిక దక్షిణాది హీరోయిన్లు ఎక్కువగా బొద్దు మీదనే ఫోకస్ చేస్తారని, సోషల్ మీడియాలో కూడా బొద్దు కనిపించేలా దిగిన ఫోటోలనే షేర్ చేస్తారని సంచలన వ్యాఖ్యలు చేసింది మాళవిక.

# హైబ్రిడ్ పిల్లతో అందుకే అందరికీ ఇబ్బంది!

సాయి పల్లవిని సినిమాకు ఒప్పించాలంటే ఎంత కష్టమవుతుంది? అన్నది ఓ సందర్భంలో చందు మొండేటి ఎంతో ఓపెన్ గా చెప్పిన సంగతి తెలిసిందే. సాయి పల్లవిని సినిమాకు ఒప్పించాలంటే ఎంత కష్టమవుతుంది? అన్నది ఓ సందర్భంలో చందు మొండేటి ఎంతో ఓపెన్ గా చెప్పిన సంగతి తెలిసిందే. ఆమెతో కలిగిన అనుభవాన్ని చందు రివీల్ చేసాడు. ఆ సమయంలో కథ, పాత్రల విషయంలో సాయిపల్లవి రెయిజ్ చేసే డౌట్లు మామూలుగా ఉండవు..ఆమెతో ఎవరు సినిమా తీయాలన్నా? ఒప్పించాలన్నా వాళ్లకు చుక్కలు కనిపిస్తాయన్నారు. సాయి పల్లవిని ఒప్పించడం అంటే? ఏ డైరెక్టర్కి అయినా ఓ సవాల్ గానే ఉంటుందని తన అనుభవాన్ని చెప్పే ప్రయత్నం చేసారు. తాజాగా సాయి పల్లవి కథలను ఎలా ఎంచుకుంటుందో రివీల్ చేసింది ఎలాటి పాత్రలోనైనా దాని లోతెంత అని చూస్తా. ఆ పాత్రలో బరువైన భావోద్వేగం ఉందా? లేదా? అన్నది ఎక్కువగా చూస్తా. దాని మీద నాలో నేనే విశ్లేషణ చేసుకుంటా. నటిస్తే ఎలా ఉంటుంది అన్నది మాత్రం సీరియస్ గా ఆలోచన చేస్తా. అన్నది తర్వాత సంగతి ఆ పాత్ర ద్వారా ప్రేక్షకుల్లో ఎంత వరకూ గుర్తింపు వస్తుందన్నది చూసుకుంటా. ఎందుకంటే ప్రేక్షకులకు నిజాయితీగల కథలు మాత్రమే చెప్పాలి. ఏ పాత్ర పోషించినా అందులో భావోద్వేగానికి ప్రేకేక్షకులు కనెక్ట్ అవ్వాలి. అలా కనెక్ట్ కాలేనప్పుడు ఎంత గొప్ప పాత్ర పోషించినా అది వృద్ధా ప్రయత్నమే అవుతుంది. అవార్డుల కన్నా ప్రేక్షకుల ప్రేమను గెలుచు కోవడం అన్నది గొప్ప విషయం. కానీ.. అవార్డుల గురించి ఎప్పుడు ఆలోచించను. ప్రేక్షకుల మెప్పు తర్వాత అవార్డులు వస్తే దాన్ని బోనస్ గా మాత్రమే భావిస్తాను. అలా అవార్డులకు రెండో ప్రాధాన్యత ఇస్తానని తెలిపింది. సాయిపల్లవి అందుకే తక్కువ సినిమాలు చేయగల్గింది. నటిగా తనకంటూ కొన్ని పరిమితులు విధించుకుని కొనసాగుతుంది. ప్రకటనల్లో కనిపించదు...గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటుంది. కోట్లు ఇస్తామన్నా నో ఛాన్స్ అంటూ రిజెక్ట్ చేస్తుంది




# ది పర్ఫెక్ట్ బోల్డ్ బ్యూటీ..!



శ్రీదేవి కూతురు జాన్వి కపూర్ బోల్డ్ ఇమేజ్ సంపాదించేందుకు బాగానే కష్టపడుతుంది. సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా సరే రెగ్యులర్ గా తన లేటెస్ట్ ఫోటో షూట్స్ తో తన మీద ఫోక మిస్ అవకుండా చేస్తుంది. అందుకే రోజు ఒక కొత్త అవతారంలో కనిపిస్తుంది. గ్లామర్ షోలో తనకంటూ ఒక ప్రత్యేక ఉందంటూ ఆమె చేస్తున్న స్కిన్ షో చూస్తేనే అర్థమవుతుంది. మడి కట్టుక్ కూర్చుంటే అవకాశాలు కష్టమే అందుకే గ్లామర్ గేట్లు పూర్తిగా ఎత్తేసి తన అందాలతో అలరించేస్తుంది

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com